కథ

# జీవనది

మల్లాది రవిశంకర్

గోదారి నంగనాచిలాగా ప్రవహిస్తూనే వుంది. కొండల్లో ఉరుకుతూ...కోనల్లు నిండుతూ..ఆకాశ గంగతో హస్తాలు కలుపుతూ.. ముందుకి ప్రవహిస్తూనే వుంది.

దూరంగా లంకపల్లి డొంక రోడ్డు మీద నుండీ కూరగాయల, జామపళ్ళ గంపల్ని తల మీదకెత్తుకొని పడవెళ్ళిపోవటానికి ముందే అందుకోవాలని వడివడిగా నడిచివస్తున్న అవ్వలు... వేణ్ణీళ్ళకి చన్నీళ్ళలాగా ఏదో సంపాదించి ఎదిగిన కొడుకులకి భారం కాకుండా, కోడళ్ళ ముందు తేలిక కాకుండా చేతనయినంత చేయూతనివ్వాలనే తపన వాళ్ళల్లో కనిపిస్తోంది.

రెండు నిమిషాల క్రితం పంతులుగారు మంత్రోక్తంగా తర్పణంతోపాటు గోదారిలో వదిలించిన పూలూ, దర్భలూ దూరంగా కెరటాలమీద తేలుతూ ముందుకెడుతున్నాయి.

రంగయ్య తాత లేని పడవల రేవు వెలవెలపోతోంది.

తాతని పొట్టనపెట్టుకున్న గోదారి, ఏమీ ఎరగనట్టుగా ఇంకా దర్పంగానే ప్రవహిస్తోంది.

ఎందరో జీవితాలకి బాటలు వేసిన గోదారి..వేల ఎకరాల కొండ్రని రత్నగర్భగా మార్చిన గోదారి...ప్రజా జీవన వికాసానికి జిలుగు వెలుగులిచ్చిన గోదారి...నా జీవితంలో ఎందుకీ విషాదాన్ని నింపింది?

ముక్కు పచ్చలారని వయసులోనే కన్నతల్లినీ, తాతనీ దూరం చేసింది.

సుడిగుండంలో గడ్డిపరకలా ఉన్న జీవితానికి అర్థం, పరమార్థం ఇచ్చి, ఈ పోటీ ప్రపంచంలో దీటుగా నిలబెట్టాలని నాకోసం చెమట, రక్తం కలగలిపి ధారపోసిన రంగయ్య తాతని కూడా పొట్టనపెట్టుకుంది.

ఇంత ఉసురు పోసుకున్న ఈ గోదావరి ఏం బావుకుంది?


'రంగత్తురంగ తరంగ హస్తముల యా రత్నాకరేంద్రుడు నీయంగం ఒంటి సుఖించునే...'

అంటూ ఒక కవి ఒక నదిని గురించి చెప్పినట్టు... చివరికి సముద్ర గర్భంలోనే కదా కలిసిపోయేది.

మెల్లగా రేవు ఒడ్డున ఉన్న పొగడ చెట్ల క్రిందకి వెళ్ళి కూర్చున్నాను. రంగయ్య తాత లేని ఇంట్లో అడుగుపెట్టడానికి మనసు అంగీకరించలేదు. తాత ఇంక కనపడదు అనే విషయాన్ని మనసు అంగీకరించటం లేదు. దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళలోంచి నీళ్ళు ధారగా కారుతున్నాయి.

గంపలు తలమీద పెట్టుకొని అటుగా వెళుతున్న అవ్వలు, నా వంక జాలిగా చూస్తూ..

"ఏడ్చి ఏం ప్రయోజనం నాయనా! పోయిన ప్రాణి తిరిగొస్తాదా? మనసు దిటవుచేసుకో! ఏడవకు" అని ఓదార్చి, వాళ్ళు కూడా పైటచెంగుతో కళ్ళొత్తుకొని వేగంగా పడవల రేవు వైపు సాగిపోయారు మళ్ళీ ఎక్కడ పడవెళ్ళిపోతుందో



నని. అందరితో పాటు వెడుతున్న ఒక అవ్వ వెనక్కి తిరిగొచ్చి...

"రెండు రోజుల క్రితం పడవెక్కటానికి చిల్లరలేకపోతే, ఏం పరవాలేదు, ఎక్కు ఎక్కమ్మా! అని పడవెక్కెచ్చుకున్నాడు మీ తాత. చచ్చి ఏ లోకాన ఉన్నాడో మరి. దహోత్రుడివి కదా! పున్నామ నరకం నుండి ఆ పెద్దమనిషిని బయటపడెయ్యవయ్యా" అని సలహా ఇచ్చి, "ఇదిగో నా బాకీ" అంటూ ఐదు రూపాయల బిళ్ళని నా చేతికందించి..పడవల రేవు వైపు వేగంగా సాగిపోయింది.

తాత బాకీ ఐదు రూపాయల్ని అటూ ఇటూ తిప్పి చూస్తుంటే అందులో తాత రూపం తాత చెప్పిన నా గతం గుర్తుకొచ్చింది.

☆☆☆

పన్నెండు సంవత్సరాలకొచ్చే పుష్కర కోలాహలంతో లంకపల్లి పడవల రేవు కిటకిటలాడుతోంది. ఇసకేస్తే రాలని జనాలు. నేలీనినట్లుంది అక్కడి వాతావరణం. అంత చిన్న రేవులో కూడా తొక్కిసలాటలు. పదిమంది దుర్మరణం. పదిహేనుమందికి తీవ్ర గాయాలు.

ఆ జన సందోహంలో తప్పిపోయిన నాలుగేళ్ళ నేను, తాత కంటపడ్డానట "అమ్మా, తాతా" అని ఏడుస్తూ...

రంగయ్య తాత నన్ను అక్కున చేర్చుకొని, అమ్మనీ, తాతనీ వెతికిపట్టుకోవటానికి విశ్వప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది.

నా ఏడుపు మాన్పించటానికి-

"ఐస్‌ఫ్రూట్ తింటావా!" అని అడిగితే..వద్దు అమ్మ కావాలన్నానట.

"పోనీ తాటి ముంజులు కావాలా!" అని అడిగితే..వద్దు తాత కావాలి అన్నానట.

"నేనే గదరా! తాతని" అంటూ రంగయ్య తాత బుగ్గన ముద్దుపెట్టుకొని "తాతో" అంటూ తన వైపు చూపించుకున్నాడట. దాంతో ఏడుపు కొంచెం ఆపి ఆయన మీసాలతో ఆడటం మొదలుపెట్టానట.

ఆ క్షణం నుండీ...

ఎవడు వీడని ఎవరైనా అడిగితే-"నా మనవడు" అని అందరికీ చెప్పాడు.

నిన్నటిదాకా లేని మనవడు ఈరోజు ఎక్కడినుండీ ఊడిపడ్డాడు. అసలు నీకు భార్యాబిడ్డలే లేకపోతే మనవ

దెక్కడి నుండీ ఊడిపడ్డాడని ఎవరైనా నిలదీస్తే-
అందరికీ ఒకటే సమాధానం
"అది అంతే..." అంటూ
ఆ సమాధానంతో అందరూ అనుకున్నారట-
"నీకు అంతే అయితే..మాకూ అంతే" అని. ఆ రకంగా రంగయ్యతాత మనవడినయిపోయాను.

తాత, నన్ను తనతోపాటు పడవ మీద తిప్పలేదు.
చదువుకోమని పలకకొనిచ్చి బడికి పంపించాడు.

తాత అంటుండేవాడు "రేపు నేను కాలం చేసి పైక లోకాలకి వెడితే, అక్కడ నీ అసలు తాత అగుపించి...నా మనవడి చేతికి పలక ఇవ్వకుండా, పడవ తెడ్డెందుకిచ్చావయ్యా! అని నిలదీస్తే...నేను తల వంచుకోకూడదు. గర్వంగా తలెత్తుకోవాలి"



తాత మాట ఆ రోజునుండీ, ఈరోజు దాకా మర్చిపోలేదు. ఆయన నామీద, నా చదువుమీద ఖర్చు పెట్టిన ప్రతి రూపాయిలోనూ, వెదురుకర్రల్ని నీటిప్రవాహం మీద కదిపే ఆయన శ్రమ కనిపించేది. పదో తరగతి స్టేట్ ఫస్ట్ వచ్చినప్పుడు...

"ఈ విజయం నాది కాదు..నా తాతది" అని నేను చెప్పిన మాటల్ని ప్రముఖంగా రాస్తూ అన్ని పత్రికలూ, తాత ఫోటో, నా ఫోటో పేపర్లలో వేసినప్పుడు పట్టరాని ఆయన సంతోషం నాకు ఇంకా గుర్తు. "ఒక సరంగుకు ఇంతకంటే గౌరవం ఏం ఉంటుందిరా" అన్నారు ఆనందబాష్పాల మధ్య.

పడవంతా పేపర్లో వచ్చిన మా ఫోటోలని అంటించి, అడిగిన వాళ్ళకీ, అడగనివాళ్ళకీ కూడా నా మనవడు స్టేట్ ఫస్ట్ వచ్చాడని చెప్పుకున్నాడు.

ఆయన ఆ సంతోషం నాకు మంచి ఇన్‌స్పిరేషన్ ఇచ్చింది.

అప్పటి నుండీ కొద్దికాలం క్రితం పూర్తిచేసిన ఇంజనీరింగ్ దాకా పట్నంలో చదువుకుంటూ, అప్పుడప్పుడు ఇక్కడికి వస్తుండేవాడిని. నా చదువు దాదాపుగా స్కాలర్‌షిప్‌ల మీదే నడిచినా నెల నెలా డబ్బులు పంపించేవాడు తాత.

నేను చదువుకి పట్నం వెళ్ళిపోయాక, వీరన్న అనే ఇంకో అనాథకుర్రాడ్ని దగ్గరకి తీసి, తన చేతికింద పెట్టుకున్నాడు తాత. వాడిని తాత దగ్గరకి తీయటం నాలో కొంత ఈర్ష్యని కల్గించటాన్ని గమనించిన తాత అనేవాడు "నువ్వు బుద్ధివయితే..వాడు బలంరా" అని.

తాత ఎంత చెప్పినా వాడిని నేను పూర్తిగా అంగీకరించలేదు. వాడంటే నాకెప్పుడూ చిన్నచూపే. అది గమనించిన తాత నన్ను అనేక సందర్భాల్లో మందలించాడు.

నేను శెలవలకి వస్తున్నానని తెలియంగానే వానయినా, వరదయినా తాత నాకోసం పడవల రేవులో ఎదురుచూస్తూ ఉండేవాడు.

ఆరోజూ అలాగే జరిగింది. ఐఐటీ చెన్నయ్ నుండి ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఇంటికి వస్తున్నాను. ఇంకో మంచి వార్త ఏమిటంటే లండన్‌లో నాకు మంచి ఉద్యోగం కూడా దొరికింది. లంకపల్లి అనాథకి లండన్‌లో ఉద్యోగం. తాతకి ఈ శుభవార్త చెపితే ఎలా రియాక్ట్ అవుతాడో?

ఇంకో ఆందోళనకరమైన వార్త ఏమిటంటే గోదారికి వరదలనీ, గంట గంటకీ నీటిమట్టం పెరిగిపోతూ ప్రమాదస్థాయిని దాటిపోతోందని. ఇలాంటి గడ్డు సమయంలో తాతని, నా కోసం రావద్దని కబురు చెయ్యాలని ఎంతగానో ప్రయత్నించాను. కానీ టెలిఫోన్ లైన్స్ సరిగా పనిచెయ్యకపోవటంతో తాతని ఫోన్ ద్వారా చేరుకోలేకపోయాను. ఈ వరదలకి తోడు కుంభవృష్టిగా వర్షం కూడా కురుస్తోంది.

ఆందోళనగా లంకపల్లి రేవు చేరుకున్నాను. వరద నీరు దాదాపు నగం ఊళ్ళోకి వచ్చేసింది. ముంపునకు గురైనవాళ్ళు ఇళ్ళకప్పుల మీదా, ఇంకా సురక్షిత స్థానాల్లో చేరుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

అంత వరదల్లోనూ, వర్షంలోనూ నాకోసం ఎదురుచూస్తున్న రంగయ్యతాత నన్ను చూడగానే ఎదురొచ్చి అక్కున చేర్చుకున్నాడు. "పెద్ద చదువులు ముగించిన దొరగారికి ఈ చిన్న ఊరికి స్వాగతం" అంటూ, వెంట వీరన్నని తీస్కురాలేదని అడిగితే, ఈ వరదల్లో వాడినెందుకు తీసుకురావటం అని వద్దన్నానని చెప్పాడు తాత.

## గ్లామర్ సీక్రెట్

మిల్కీవైట్ భామగా పాపులర్ అయిన తమన్నాని మీ గ్లామర్ రహస్యం చెప్పండి మేడమ్ అన్నామనుకోండి. 'ఏం లేదు, మా అమ్మ అందమే నాకూ వచ్చింది అంతే' అని సింపుల్‌గా చెబుతుంది. మరీ చెప్తారు మీరు, అందం కోసం జాగ్రత్తలు తీసుకోరా? అంటే- 'నిజంగా నిజమండీ, ప్రత్యేకంగా నేనెలాంటి గ్లామర్ టిప్స్ పాటించను. కాకపోతే వారానికి రెండు సార్లు పెరుగులో కాసింత శనగపిండి కలిపి దాన్ని ప్యాక్‌గా వేసుకుంటాను, అంతే' అని తాపీగా చెబుతుంది తమన్నా.

తాతకి లండన్‌లో వచ్చిన నా ఉద్యోగావకాశం గురించి చెప్పాను. తాత స్వగతంగా అన్నాడు "ఆ దేశంకాని దేశానికెళ్ళి, ఏం బావుకుంటావురా?" అంటూ.

"నీకోసం బంగారు పడవ కొంటాను తాతా! నా కోసం ఇంత చేసిన నిన్ను కూడా ఒక సంవత్సరం లోపు నాతో తీసుకెళ్ళిపోతాను" అని చెప్పాను.

"బంగారుపడవలు గోదావరిలో ఎదురీదలేవయ్యా! పుట్టిబుద్ధెరిగినప్పటి నుండీ నాకు తెలిసింది ఈ గోదావరీ, నా పడవా, ఈ ఊరునే. గోదారి గుండెల్లో పుట్టి పెరిగిన నేను, ఈ గోదావరిలో, ఈ మట్టిలోనే కలిసిపోవాలి కానీ, దేశాంతరాలు ఎందుకురా? నాకిష్టంలేదు" అన్నాడు తాత. కావాలంటే తమ్ముడ్ని తీస్కెళ్ళు అన్నాడు. నేను ఆ మాట తప్పించాను.

పడవెక్కమని తాత తొందర చేశాడు. ఈ వరద ఒరవడిలో మనం వెళ్ళగలమా అని అనుమానం వ్యక్తం చేశాను. తన శక్తిని అనుమానించి, అవమానించకుండా పడవెక్కమని తాత తొందర చేశాడు. పడవ ముందుకి కదిలింది. వరద ధాటికి పడవ ఊగిసలాడుతోంది. తాత చాలా చాకచక్యంతో పడవని ముందుకి నడుపుతున్నాడు.

పడవ దాదాపుగా నది మధ్యకి చేరుకోంగానే ఈ ఉపద్రవం సంభవించింది.వానజల్లు మరింత పెరగడమే కాకుండా, వరదనీరు పెల్లుబికి వస్తోంది. వాననీటితో పడవ కొంచెం కొంచెం నిండుతోంది. తాత, తన శక్తినంతా కూడగట్టి పడవని ముందుకి నడిపే ప్రయత్నం చేస్తున్నాడు. చూస్తుండగానే పడవ ఒక పెద్ద సుడిగుండం సమీపంలోకి వెళ్తోంది.

తాతకి అర్థమయిపోయింది పరిస్థితి చేయి దాటి పోయింది. మేము ప్రమాదంలో ఇరుక్కున్నామని దానికి తోడు పడవకి ఎక్కడో సన్న బెజ్జం పడ్డట్టుంది. వరదనీరు వేగంగా పడవలోకి రావటం కూడా మొదలుపెట్టాయి.

తాత ఇంక చిన్న అవకాశం కూడా తీసుకోలేదు. ఒక్కసారిగా నన్ను నీళ్ళల్లోకి తోసేశాడు. సుడిగుండానికి దూరంగా వెళ్ళిపడ్డాను. తను కూడా కంగారుగా గోదావరిలోకి దూకేశాడు.

అక్కడే పెద్ద పొరపాటు జరిగిపోయింది. దురదృష్టవశాత్తూ తాత సుడిగుండంలో ఇరుక్కుపోయాడు. బలాన్నంతా ఉపయోగించి బయటికి రావటానికి తాత ప్రయత్నిస్తుంటే, ఇంకా బలంగా సుడిగుండం తాతని తనలోకి లాక్కుంటోంది. దాన్ని గమనించి, తాతని రక్షించాలని ఈదుకుంటూ అటువైపు రాబోయాను. తాత గట్టిగా అరిచారు నన్ను వారిస్తూ తొందరగా ఒడ్డుకి చేరుకోమని. చివరిసారిగా తాత ముఖం చూశాను. అది నవ్వుతోంది. ప్రేమగా, దయగా, నా వైపు చూస్తూ. చేయి పైకెత్తి నన్ను ఆశీర్వదించి, ఏదో చెప్పబోతుండగా నా కళ్ళముందే సుడిగుండం తాతని తనలోపలికి లాగేసింది. గుండె గొంతుకనుండీ దుఃఖం పెల్లుబికింది. తాత గోదావరిలో మునిగిపోతుంటే నేను ఒడ్డుకి పారిపోతున్నాను.

అమ్మా, అయ్యా లేని అనాథని దగ్గరికి చేర్చి ఒక గుర్తింపునిచ్చిన ఒక మహామనీషి మునిగిపోతుంటే, భీరువులా ఒడ్డుకి ఈదుకుంటూ వెదుతున్నాను. ఎలా ఒడ్డుకి చేరానో నాకే తెలీదు.

☆ ☆ ☆

తాత మృతదేహం కోసం ఎంత గాలించినా ప్రయోజనం లేకపోయింది. ప్రాణం లేని ఆయన శరీరాన్ని కడసారి కూడా చూడలేకపోయాము.

తాత అన్నట్టుగానే ఈ మట్టిలో, ఈ గోదావరిలోనే కలిసిపోయారు. ఎందుకో అనిపిస్తోంది.మనిషి జీవితం కూడా జీవనది లాంటిదే. చావు పుట్టుకలు, బంధాలు-అనుబంధాలు, జీవనదికి పాతనీరు పోయి కొత్తనీరు వచ్చినట్టుగానే. 'కాలం, కెరటం ఎవ్వరికోసం ఆగవు' అన్నట్టు ఈ జీవిత జీవనదిలో ప్రతి మనిషీ కొట్టుకుపోవలసిందే. నిన్నటి వాస్తవం, నేటికి చరిత్రగా మిగిలిపోతుంది. రంగయ్యతాత కళ్ళముందే చరిత్రలోకి వెళ్ళిపోయాడు.

దూరంగా నిలబడి నావంకే బెదురు బెదురుగా చూస్తున్న వీరన్నని పిల్చాను. మెల్లగా దగ్గరికి వచ్చాడు.

ఎందుకో ఇంతకాలం చెయ్యలేనిది ఇప్పుడు చేశాను.వాడిని అక్కున చేర్చుకున్నాను. వాడు ఏడుస్తున్నాడు. ఇంతకాలం మోటు వెధవ అనుకున్న వాడు వెక్కి వెక్కి పొర్లి పొర్లి ఏడుస్తున్నాడు. ఈ చిన్ని ఓదార్పుకే కదిలిపోయినట్టుగా. జీవిత జీవనదిలో తెగిపోయిన బంధాన్ని తల్చుకుతల్చుకు ఏడుస్తున్నాడు. గోదావరి తెంచి, సముద్రంపాలు చేసిన మా ఋణానుబంధం కోసం..వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

ఎంత ఓదార్చినా వాడి దుఃఖం అంత తొందరగా ఆగలేదు. నేను ప్రాక్టికల్ మనిషిననుకుంటా, తొందరగా సమాధానపడ్డాను.

వీడు, తాతకి చేదోడువాదోడుగా ఉండటంతో వాడి దుఃఖం చెప్పనలవి కావటం లేదు.

వాడిని దగ్గరికి తీసుకొని ఓదార్చాను. తాత పడవకీ, తాత ఇంటికీ, తాత ప్రేమించిన ఈ రేవుకీ నీవే వారసుడవని చెప్పాను. వాడు చిత్రంగా నా వంక చూశాడు. వాడికి చెప్పటం మొదలుపెట్టాను.

"నా బ్రతుకుబాట వేరు. తాత పడవ నడపడం నీకే నేర్పించారు. అందుకే ఆ గుహునికి నీవే వారసుడవవ్వాలి. సంవత్సరానికి ఒకసారి ఈరోజు ప్రపంచంలో ఏ మూల ఉన్నా ఇక్కడికి వస్తాను. ఇద్దరం తాతకి పిండప్రదానం చేద్దాం. కాకి రూపంలో తాత పిండాన్ని ఆరగించటానికి తప్పకుండా వస్తాడు" అన్నాను.

"ఆరోజు కోసం సంవత్సరం పొడుగునా ఎదురుచూసి, ఆరోజు ఈ ఒడ్డునే నీకోసం వేచి చూస్తాను అన్నా" అన్నాడు వీరన్న. ఆ పిలుపు విచిత్రంగా వినిపించినా, ఆత్మీయంగా అనిపించింది. తాత పోతూ పోతూ ఇంకో బంధాన్ని కలిపి మరీ వెళ్ళాడు. జీవనదిలో కలిసే ఒక ఉప నదిలాగా. వీడి మంచి చెడ్డలు నేనే చూడాలి అని మనస్ఫూర్తిగా అనుకున్నాను.

వాడి నుదుటి మీద ముద్దుపెట్టుకొని, నా మజిలీ వైపు ప్రయాణం సాగించాను.

చాలా దూరం ముందుకి నడిచి వెనక్కి తిరిగి చూస్తే, ఇంకా నా తమ్ముడు ఏటిగట్టు మీదే నిలబడి ఉన్నాడు.

❍



## ఐశ్వర్య తమిళం

స్వతహాగా కొంకణి (కర్నాటక) మాతృభాష అయిన ఐశ్వర్యారాయ్‌కి హిందీ కూడా బాగా వచ్చు. అయితే ఇటీవల 'రోబో' షూటింగ్‌లో ఐశ్వర్య తమిళంలో చెప్పిన డైలాగుల తీరుకి అటు రజనీకాంత్, ఇటు దర్శకుడు శంకర్ కూడా ఆశ్చర్యపోయారట. కారణం స్పష్టంగా తమిళ పదాల్ని పలుకుతూ డైలాగులు చెప్పేసిందిట ఐశ్వర్య. ఇంత బాగా మీకు తమిళం వచ్చునుకోలేదుసుమండీ అంటే- 'నా తొలి సినిమాయే 'ఇరువర్' (ఇద్దరు) తమిళ భాషది, ఇంత కాలమైనా ఆ భాషని పలకలేనా చెప్పండి' అంటూ నవ్వేసిందిట ఐష్. తన డబ్బింగ్ కూడా తనే చెప్పుకుంటుందేమో?